# అందమైన ఆత్మహత్య

"నువ్వు చాలా అదృష్టవంతురాలివమ్మా!" ప్రేమతో తల నిమురుతూ అన్న తండ్రి మాటలను జవాబు చెప్పకుండా మవునంగావుండి పోయింది శశి. జవాబు చెప్పటానికి ఆ మాటలు ఈ రోజు క్రొత్తవికాకపోయినా, వాటిలో మాత్రం ప్రత్యేకతవుంది. సిరిసంపదలుకల కుటుంబంలో పుట్టిన, తల్లి దండ్రుల ముద్దులకూతురై ఎప్పుడూ అదృష్టవంతురాలిగానే పరిగణించబడుతోంది తను!

చిన్నతనంలో "మా శశి చాలా అదృష్టవంతురాలు. ఆమె ముఖంలో లక్ష్మీ కళవుంది. ఇంత అందమైన పిల్లకోసం ఎవరు తపస్సుచేస్తున్నారో" అని ప్రక్క యింటి పిన్నిగారు తల్లితో అంటూవుండే మాటలు; సమాధానంగా తన తల్లి పెదవులపై వెలిగిపోయే చిరునవ్వు; చూస్తూ ఏమీ అర్థం కాక తల పంకించి ఊరుకునేది. వయసు వస్తున్నా; "అందం వల్ల అదృష్టం లభిస్తుందో, అదృష్టం వలన అందం లభిస్తుందో" అర్థంకాకపోయిన శశికి; ఈ రెండింటికీ ఏదో అవినాభావ సంబంధం వుందని మాత్రం అర్థమయింది.

అయితే ఈనాడు తండ్రి తనను ఆపాదించిన అదృష్టంలో ప్రత్యేకత లేకపోలేదు. ఆ ప్రత్యేకత అర్థంకావటానికి ఆమెకు

ఎంతో సేపు పట్టలేదు. కొద్దిక్షణాలు మాత్రమే అవుసర మయ్యాయి.

"అబ్బాయి చాలా అందంగా వుంటాడు. అందచందా లలో నీకేమాత్రం తీసిపోడనుకో!"

అదే! అదే ప్రత్యేకత! తనను చూపినవరుడు అందంగా వుండటం తన అదృష్టానికి కారణం! తండ్రిమాటలకు ఏం సమాధానం చెప్పాలో అంతుచిక్కలేదు. అందుకే నిర్లిప్తంగా నవ్వి మాట్లాడకుండా వుండిపోయింది.

*　　　*　　　*

తనకు ఎప్పుడూ ఈ అందంమీద నమ్మకంలేదు. తన అందమేకాదు ఎవరి అందంమీదా విశ్వాసంలేదు; అసలు, ఈ సౌందర్యం అనేది గాజుపాత్ర లాటిది. దాన్ని జాగ్రత్తగా కాపాడుకోవటంలోనేవుంది. ఏ మాత్రం అశ్రద్ధ జరిగినా, అదృష్టం లేకపోయినా అది నాశనమయి పోతుంది. ఏ క్షణాన అయినా అందమైన ఈ సౌందర్యం పాడుకావొచ్చు. అలాటి వస్తువుకి లోకం ఇంత ప్రాముఖ్యతను ఎందుకు ఆపాదిస్తుందో ఎంత ఆలోచించినా శశికి అర్థంకాలేదు.

ఒక్కొక్క క్షణంలో సౌందర్యాన్ని తల్చుకుంటే ఒళ్ళు కంపరమెత్తుతుంది. రసానుభూతి అయిన "అందం" వెనుక, భయంకరంగా, పడగలువిప్పుకొన్న విషసర్పాలు తిరుగాడు తున్నట్లు తోస్తుంది. తనకువున్న ఒక్కగా నొక్క

అక్కయ్య శారద జీవితం నాశనం అయిపోవటానికి కారణం ఏమిటి? ఈ అందం కాకపోతే!

అక్కయ్యను చూసుకునేందుకు వచ్చిననాడు బావ ఆమెవైపు కన్నార్పకుండా చూస్తూ శిలాప్రతిమే అయ్యాడు. అక్కయ్యలో అమితమయిన అందంవుంది.

తనకూ, అక్కయ్యకూ వయస్సులో చాలా తేడా వుంది. తను పదేళ్ళవయసులో వుండగానే; అక్కయ్య వివాహం చేసుకొని సంసార జీవితంలో అడుగుపెట్టింది. కాని, అంత సౌందర్యంకల అక్కయ్య జీవితం—అందమైన జీవితం కొద్దిరోజులలోనే నరకంగా మారిపోయింది.

"వంటచేస్తున్న సమయంలో ఇంత ప్రమాదం సంభవిస్తుందని ఎవరు అనుకున్నారు? ప్రమాదం జరిగినా; అందమైన అక్కయ్య ముఖం అంతభయంకరంగా—చూడలేనంత ఘోరంగా మారిపోతుందని ఎవరు ఊహించగలిగారు? అన్నీ రోజుల మీాద జరిగిపోయాయి.

అప్పటినుండీ బావకు అక్కయ్యపై మోజుతగ్గిపోయింది. కసురుకోవటం, విసుగుదల చూపించటం ఎక్కువయ్యాయి. అక్కయ్యపై ఆయన అంతవరకూ చూపించిన ప్రేమ అంతా ఎక్కడికి రెక్కలుకట్టుకొని ఎగిరి పోయిందో తెలియదు. గౌరవానికీ, ఆత్మాభిమానానికి మహా పేరుగా పెరిగిన అక్కయ్య, ఆయనతో కాపురం చెయ్యలేకపోయింది. అక్కయ్యను నిర్దాక్షిణ్యంగా పుట్టింటికి పంపి, మరో వివా

హం చేసుకున్నాడు బావ. అక్కయ్యను పంపివేస్తూ ఆఖరి క్షణంలో బావ అన్నాడట. "రా. సిలావున్నావు చూడటానికి. నీతో సంసారం ఎవరు చెయ్యగలరు?" అని. శారద అక్కయ్య ఆయనకు చేసిన సేవలకూ, చూపించిన ఆదరణకు ప్రతిగా లభించిన మాటలు అవి. బాధతో, దుఃఖంతో కాలం గడపలేని అక్కయ్య ఆత్మహత్య చేసుకుంది. అందమయిన అక్కయ్య జీవితం అలా సమాప్తమయింది. ఆ సంఘటన జ్ఞప్తికివస్తే గుండెలు పిండుతున్నట్లు వుంటుంది తనకు.

♦ ♦ ♦ ♦

"ప్రతివ్యక్తీ క్షణికమయిన ఈ బాహ్య సౌందర్యానికే విలువనిస్తారు. కాని ఆత్మసౌందర్యానికి విలువ ఎందుకు ఇవ్వరు?" తన మిత్రులలో చాలామందిని ప్రత్యేకంగా గమనించింది శశి. బాహ్య సౌందార్యాన్నిబట్టి గుణగణాలు బేరీజు వేస్తారు. అందుకే సౌందర్యం మీద నమ్మకం పోయింది శశికి.

నిజానికి తన సౌందర్యంలో ఏ మాత్రం లోటులేదు. తను అందంగా వుంటుందని కాలేజీలో అందరు విద్యార్థులూ, విద్యార్థినులతో సహా ఏకగ్రీవంగా ఆమోదిస్తారు. అందుకే తనకు "మిస్ కాలేజ్" అని పేరు పెట్టినట్లుకూడా తెలుసు! అనేకమంది యువకులు తనకోసం తపస్సు చేస్తున్నట్లు, తను అనుగ్రహించి వరం ఇస్తే, తక్షణం వారి సర్వస్వాన్నీ తన

కోసం త్యాగంచెయ్యగలరనీ నిశ్చయంగా తెలుసును. లేకపోతే అంతమంది యువకులవద్దనుండి అన్నిరకాలుగా ప్రేమ లేఖలు ఎలావస్తాయి? అన్ని ఉత్తరాలూ చదివి చిరునవ్వు నవ్వుకొని చింపి పారవేయటం అలవాటు అయిపోయింది తనకు. ఆ లేఖలనిండా; తన అందాన్ని ఆరాధిస్తామని, తనను పువ్వుల్లోపెట్టి పూజిస్తామనీ, ఒకటే సొద వర్ణిస్తారు. తన అందానికి జోహారులర్పిస్తున్నట్లు బానిసలయినట్లు చిత్రిస్తారు.

తను క్లాసులో ఎప్పుడూ చాలా "ఫార్వర్డు" గా వుంటుంది. ఒకటి రెండు "సబ్జెక్టులు" తప్ప మిగిలినవాటిలో మొదటి మార్కులే వస్తూవుంటాయి. తనుపెద్ద మేధావి కాకపోయినా, సామాన్యమయిన తెలివితేటలు తనకు వున్నట్లు శశికి తెలుసును.

ముఖ్యంగా, తనకు శ్రమదానంలోనూ, ఇతర వార్షికోత్సవాలలోనూ పనిచెయ్యటమంటే ఆసక్తి ఎక్కువ. "వరద బాధితుల సహాయనిధి" ఎక్కువగా ప్రోగుచేసినందులకు, వారిని రోగాలనుండి రక్షించేందుకు ప్రథమ చికిత్స జరిపినందులకు, తనను మెచ్చుకొని "ప్రిన్సిపాల్" "ప్రశంసా పత్రం" కూడా ఇచ్చారు. వార్షికోత్సవసందర్భంలో మాట్లాడుతూ, "శశిలాంటి అమ్మాయి మన కాలేజీలో వుండటం మన అదృష్టం. ఆమె వరదబాధితులకు చేసిన సేవ అపారం! రాత్రనక, పగలనక వారి ఆరోగ్యవిషయంలోనూ, తిండి వస్తువుల సరఫరా విషయంలోనూ ఎంతో శ్రద్ధను చూపింది.

"అని కొనియాడుతూ, ఆరోజు ప్రత్యేక అతిధిగా విచ్చేసిన మంత్రిగారిచేత ఆ పత్రాన్ని ఇప్పిస్తూ వుంటే; నిజంగా తను గర్వంతో పొంగిపోయింది. విద్యార్థినీ, విద్యార్థుల హర్షధ్వానాలు మిన్నుముట్టుతూ వుంటే వెళ్ళి ఆనందంతో ఆ పత్రాన్ని అందుకొంది. సభ ముగిశాక చాలామంది వచ్చి తనను ప్రశంశించారు. ఆఖరున ప్రభాకరం కూడా వచ్చాడు.

ప్రభాకరం కాలేజీ యువకులలో కందరిలోనూ అందంగా వుంటాడు. పెద్దమనిషిగా విద్యార్థి సంఘం మధ్య, "లెక్చరర్స" మధ్య అతనికి మంచిపేరువుంది. అతనువచ్చి అభినందిస్తూ అన్న మాటలు వింటూ వుంటే మాత్రం ఒళ్ళంతా శూలాలతో గ్రుచ్చినట్లు అయింది శశికి. "అందమైన యువతులు ఏంచేసినా అందంగానే వుంటుంది సుమండీ. సౌందర్య యువకుల సేవలు చాలా మధురంగా వుంటాయి!" అన్నాడు నవ్వుతూ.

తన సేవకుమెచ్చి ఇచ్చిన సర్టిఫికేటుకూ, తన అందానికీ ముడి ఎందుకు పెట్టాడో మాత్రం ఎంత తలకొట్టుకున్నా అర్థంకాలేదు. పైగా ఒళ్ళు దహించుకుపోయింది. పైకి మాత్రం చిరునవ్వు నవ్వుతూ వెంటనే సమాధానం ఇచ్చింది. "మీలాటి అందమైన యువకులు ఏం మాట్లాడినా చెల్లుతుంది లెండి." అని, అతని ముఖంలో వింతగర్వం దోబూచులాడింది. ఆనందంలో అతని అందమైన కళ్ళు మిలమిల్లాడాయి.

"మీరు మరోలా భావించకపోతే రేపు సాయంత్రం ఒక్కసారి "బీచ్"కి రండి!" అన్నాడు తలదించుకొని.

"ఎందుకు?" తను మామూలుగానే అడిగింది.

"రేపు సావకాశంగా మాట్లాడుకుందాం. మీతో ఒక ముఖ్యమయిన విషయం చర్చిద్దామని అనుకుంటున్నాను. కాని ఈదినంవరకూ ఆప్రసక్తి మీవద్ద మాట్లాడే వ్యవధి చిక్క లేదు. రేపు ప్రశాంతంగా మాట్లాడుకుందాం" అన్నాడు.

అతనికి "బీచ్"కి వస్తానని మాటఇవ్వటంలో తనకేమీ తప్పు కన్పించలేదు. మాట ఇవ్వటమేకాదు, మర్నాడు సాయంత్రం బీచ్‌కి వెళ్ళింది.

ఆదినం తనకింకా బాగా జ్ఞాపకం! "స్కాండల్ పాయింటు" వద్ద కూర్చొని తనకోసం నిరీక్షిస్తున్నాడు ప్రభాకరం... తనువెళ్ళి అతనికి కొంచెం దూరంలో ఇసుకపై కూర్చుంది.

భానుడు అప్పటికే పశ్చిమాద్రిని చేరుకున్నాడు. ఆకాశం ఎర్ర రంగులు పులుముకొంది. ఎదురుగా సముద్రపు అలలు వింతరంగుతో మెరిసిపోతూ, విరిగిపడుతూ వుండే ఆ దృశ్యంనుండి చూపు మరల్చుకోబుద్ధికాలేదు శశికి. కొన్ని క్షణాలు గడిచాక అకస్మాత్తుగా ప్రభాకరంవైపు తిరిగింది. అతడు తనకేసి తదేకంగా చూస్తున్నాడు. ఆ చూపులు తనకేవో ముల్లులాగ గ్రుచ్చుకొంటున్నట్లున్నాయి. ఏవో కోరి

కలతో—భయంకరమయిన కోరికలతో—తనపైకి దండెత్తి వస్తున్నట్లున్నాయి ఆ చూపులు!

"అలా చూస్తున్నారేమిటి?" భయంగానే అడిగింది.

"ఓహ్! మీరు ఈ షిఫాన్ చీరలో ఎంత అందంగా వున్నారో తెలుసా! అసలే పురుషులకు మత్తెక్కించే సౌందర్యం మీలో వుంది. దానికి తోడు ఈ చీరె, వదులయిన జడలోని ఎర్రగులాబీ, ఫాలభాగంపై అల్లరిగా గంతులు వేసే ముంగురులు; ఇవన్ని చూస్తూవుంటే ఏ ప్రవరుడయితే మాత్రం మీకేసి చూడకుండా వుండగలడు చెప్పండి!" మాటలు ఆపి తన ముఖంవైపు మృదువుగా చూశాడు.

తనకు అర్థమయింది!

ప్రేమవ్యవహారాలు వల్లించటంకోసం తనను ఆహ్వానించాడన్న మాట. నిన్ననే తనకు ఈ అనుమానం అణుమాత్రం కలిగినా, "పెద్దమనిషికదా!" అని, మాటకు విలువనిచ్చి వచ్చింది.

తన అందాన్ని వర్ణిస్తూవుంటే తనకు ఒంటిమీద తేళ్ళు ప్రాకినట్లుంటుంది. అందుకే ఆ వ్యవహారం ఇక అట్టేసేపు పొడిగించటం ఇష్టంలేక పోయింది. "మిస్టర్ ప్రభాకరం! దయచేసి మీరు నన్ను పిల్చిన విషయం ఏమిటో చెప్తే నేను వెళ్ళిపోతాను." అంది సముద్రంవైపు చూపులు మరల్చుకొని.

అతడు కొంచెం స్వరం తగ్గించి "మీరు ఏమీ అనుకోనంటే నేను చెప్పదల్చుకున్నది చెప్పేస్తాను. మిమ్మల్ని కాలేజీలో చేరిన దినాన్నే చూశాను. ఆరోజే మీ అందానికి ముగ్ధుడనయ్యాను. అప్పటినుండీ మీ లావణ్య ప్రతిబింబాన్ని నా మనోఫలకంపై నుండి తుడిచివెయ్యలేక పోతున్నాను. మిలమిలలాడే మీ అల్లరికళ్ళు నన్ను ఎప్పుడో బంధించాయి. ఆ బంధంనుండి తెంపుకొని దూరంగా వెళ్ళటం నాకు సాధ్యంకాదు. ఇంతకాలం నుండీ అజ్ఞాతంగానే, మీ సౌందర్యాన్ని ఆరాధిస్తూ వుండిపోయాను. ఇంత కాలానికి నా మనసులోని మాట మీకు చెప్పే అవకాశం కల్పించినందులకు భగవంతుణ్ణి అభినందిస్తున్నాను.

శశి! మిమ్ములను నేను ప్రేమిస్తున్నాను. మీరు అంగీకరిస్తే వీలయినంతత్వరలో మన వివాహం జరుగుతుంది. సావధానంగా ఆలోచించి మీ నిర్ణయాన్ని తెలియజేయండి!"

మాటలు ఆపి దీర్ఘంగా నిట్టూర్చి ఇసుకలో పిచ్చి గీతలు గీస్తూ వుండిపోయాడు.

తను నిర్లిప్తంగా నవ్వి వెంటనే సమాధానం చెప్పింది.

"చూడండి ప్రభాకరంగారూ! నా సౌందర్యాన్ని ఆరాధించే మనిషి అంటే నాకు అసహ్యం! అందానికి దాసులయ్యే వ్యక్తులంటే నాకు ఎన్నడూ సదభిప్రాయంలేదు! నా జీవిత భాగస్వామిని ఎన్నుకోవటంలో నాకు చాలా అభిప్రాయాలు వున్నాయి. నేను మిమ్ములను ప్రేమించటంలేదు, ప్రేమించ

లేను. ఈ విషయం గురించి ఎక్కువగా ఇక ఆలోచించకండి" గొంతులో కఠినత్వం ఎంత అణచుకుందామనుకున్నా, పైకి ఉబికి వచ్చింది.

ప్రభాకరం ముఖంలోని రంగులు మారిపోవటానికి ఎంతో సేపు పట్టలేదు.

"మీ నిశ్చితాభిప్రాయం అంతేనా?" మెల్లిగా అడిగాడు.

"క్షమించండి! అంతే!"

"ఛీ! ఛీ! ఇంత అందమైన రూపం వెనుక అంతకాఠిన్యమయిన మనసు వుంటుందని ఊహించలేక పోయాను." అంటూ రుసరుసలాడుతూ లేచివెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయిన వంకే చూస్తూ తనలో నిశ్శబ్దంగా నవ్వుకొంది శశి!

తరువాత చాలాసేపటి వరకూ ఇసుకలో కాలివేళ్ళతో రాస్తూ, కెరటాలవైపు చూస్తూ కాలం గడిపివేసింది.

ప్రభాకరానికి అంతకఠినంగా సమాధానం చెప్పినందులకు మాత్రం కొంతసేపు చింతించింది. అయినా అతని మీద జాలిచూపలేకపోయింది. అతను వెళ్ళిపోతూ పలికిన మాటలు మాత్రం చెవుల్లో చాలాసేపటివరకూ, ఘోషపెట్టాయి. "ఇంత అందమైన రూపం వెనుక అంతకాఠిన్యమయిన మనసు వుంటుందని ఊహించలేకపోయాను."

ఏం! అందమైన రూపం వెనుక కఠినమయిన మనసు వుండకూడదా? రూపానికీ, మనసులోని కాఠిన్యానికీ సంబంధం ఎలా వుంటుంది? శరీరానికి పెట్టే మెరుగును, తీసుకునే జాగ్రత్తనూబట్టి బాహ్యసౌందర్యం! మనోనిర్మలతనూ, సంస్కారాన్నిబట్టి ఆత్మసౌందర్యం!

ఈ రెండిటికీ ముడి ఎందుకు పెట్టినట్లు?

నాలుగు సంవత్సరాలుగా తనఅందాన్ని ఆరాధిస్తున్నానన్న ప్రభాకరం; తన మనసులో కాస్త కఠినత్వం వుందని తెలుసుకున్నాక ఒక్కసారిగా వెనుకకు పారిపోయాడు! ఇంత కాలంనుండి తనను అజ్ఞాతంగా ఆరాధించానన్న మాటలన్నీ తన తిరస్కారంతో ఒక్కసారిగా కరిగిపోయాయి. ఇదేనా ప్రేమ!

"ఆరాధన" అంటే ప్రభాకరానికి తెలిసిన అర్థం ఇదేనా?

అంతవరకూ ప్రభాకరంపైవున్న గౌరవంకాస్తా పూర్తిగా నశించిపోయింది.

ఇంటికి తిరిగివచ్చి ముఖం దిండులోదాచుకొని ఎంతో సేపు ఆలోచించింది. ఎంత తర్కించినా ఈ బాహ్యసౌందర్యానికి ఆధిక్యత అర్థంకాలేదు. మనసుకూడా ఆ ఆధిక్యతను అంగీకరించడంలేదు.

ఆ రాత్రి అంతా ఆలోచనలతో జాగరణచేసి ఒక

నిర్ణయం చేసుకొంది. తనకు కాబోయే భర్తలో వుండవలసిన గుణగణాలన్నీ ఒక మూసలో వేసి రూపం తయారు చేయటానికి కృషి చేసింది.

ఇంట్లో తన మాటకు ఎన్నడూ తిరుగులేదు! తను కోరుకున్న వరుణ్ణి తనకిచ్చి వివాహం చెయ్యటంలో తల్లి తండ్రుల పూర్తి అంగీకారం ఎప్పుడూ వుంటుందని తనకు తెలుసు. అందుకే త కు అన్నివిధాలా నచ్చే యువకుని కోసం ఎదురుచూస్తూ, ఎన్ని సంబంధాలు వచ్చినా అంగీకరించలేకపోయింది.

◆ ◆ ◆ ◆

హడావుడిగా కాలేజీనుండి వచ్చి పుస్తకాలు గదిలో పడేసి తువ్వాలుతీసుకొని ముఖంకడుక్కునేందుకు "బాత్ రూమ్" లోకి వెళ్తోన్న శశి, తల్లిపిలుపు విని ఆగిపోయింది

"శశీ! నిన్ను చూడటంకోసం తెనాలినుండి ఎవరో వస్తున్నారు! ఇప్పుడే టెలి గ్రాం వచ్చింది. ఈసరికి "స్టేషన్"కు ట్రయిను వచ్చే వుంటుంది. త్వరగా ముఖం కడుక్కొని "డ్రస్" మార్చుకో!" అంటూ తిరిగి తన పనిలో మునిగిపోయింది. శశికి క్షణంసేపు నీరసం ఆవహించినట్లయింది.

"ఇప్పుడు తను కాలేజీకి వెళ్ళిపోవాలి! "కాలేజిడే" సందర్భంలో పాటలపోటీ ఏర్పాటుచేశారు. తనుకూడా పోటీలో పాల్గొనేందుకు తనపేరు ఇచ్చింది. తను ఇప్పుడు తప్పక వెళ్ళాలి! ఎలాగ?

తనతో మాటమాత్రంగానయినా ముందుగా ఈసంగతి చెప్పకూడదూ? "చూసుకునేందుకు రమ్మని వ్రాస్తున్నట్లు" తన చెవిలో ఒక్కముక్క వేస్తే వచ్చేనష్టం ఏమిటి?

ఆ క్షణంలో శశికి అంతులేని చిరాకుకల్గింది. విసుగ్గా ముఖం కడుక్కొని, బట్టలుమార్చుకొని, వాచీపెట్టుకొంటూ అంది. "కాలేజీలో పాటలపోటీవుంది. నేను వెళ్ళాలి! వెళ్తున్నాను!" తల్లి ఆశ్చర్యంతో నోరునొక్కుకుంటూ వుండిపోయింది.

"అదేమిటి తల్లీ! తీరా వాళ్ళు చూసుకుంటామని వస్తున్నట్లు "టెలిగ్రాం" పంపితే, నువ్వు చేసేపని ఇదా! బాగుంది నీ వరస. మగరాయుడిలా తయారవుతున్నావ్! ఇంతకీ నిన్ను అని ఏమిటి లాభం? నిన్ను ఇలా తయారు చేసినందుకు ఆయన్ని అనాలి!...నీ ఇష్టంవచ్చినట్లు చెయ్యి!" అంటూ విసవిసలాడుతూ వంటఇంట్లోకి వెళ్ళిపోయింది.

శశికి ఎనలేని దుఃఖం ముంచుకొచ్చింది! గత్యంతరం లేక "ప్రోగ్రాము" మానుకొని ఇంట్లోనే వుండిపోయింది.

* * * *

రావల్సిన పెళ్ళివారు వచ్చారు. అబ్బాయి చూడటానికి బాగానేవున్నాడు. "లా" ప్యాసయ్యాడట! తెనాలిలో "ప్రాక్టీసు" చేస్తున్నాడట!

వాళ్ళు వెళ్ళిపోతూ "పిల్ల నచ్చింది. పెళ్ళి ముహూర్తం పెట్టి మళ్ళీ లేఖ వ్రాస్తాం" అన్నారు.

ఆ రాత్రి భోజనంచేస్తూ అంది శశి. "నాన్నా! నాకీ సంబంధం నచ్చలేదు. అబ్బాయి నచ్చలేదు. అమ్మాయికి యిష్టంలేదని వ్రాసిపడెయ్యండి వాళ్ళకి."

క్షణంసేపు రాఘవయ్యగారికి నోటమాట రాకుండా పోయింది. ఆయనకు ఎంతసేపు ఆలోచించినా శశి ఆంతర్యం, తత్వం అర్థంకాలేదు. చివరకు దీర్ఘంగా నిట్టూర్చి ఏదో నిశ్చయించుకున్నట్లు "నీ యిష్టం అమ్మా! ఇక నీ కోసం నేను మాత్రం సంబంధాలు చూడదల్చుకోలేదు. నీకు నచ్చిన యువకుణ్ణి, సాంప్రదాయం కలవాడిని, మనకు తగినవాడిని, నువ్వే నిర్ణయించుకో. ఆడపిల్లలకు సంబంధం కుదర్చటం అంటేనే యజ్ఞమయిపోతున్న ఈ రోజుల్లో, ఎంతమందిని ఇలా తిప్పించగలను?" అన్నారాయన.

తండ్రికి తనమీదవుండే అభిమానానికి, ఆయన విశాల సంస్కార హృదయానికీ ఉప్పొంగిపోయింది శశి. అటువంటి అవకాశంకోసం ఎదురుచూస్తున్న శశికి ఒక్కసారి ఆకాశం చేతికి అందినట్లయింది. అందుకే అంతవరకూ మనసులో దాచుకున్న మాటను — నిరంజనాన్ని ప్రేమిస్తున్నట్లు — మెల్లిగా చెప్పేసింది. ఆ క్షణంలో ఆమె తండ్రి సాక్షాత్తు భగవంతునిలా కన్పించాడు.

* * *

నిరంజనం "బి.కామ్" ఆఖరిసంవత్సరం చదువుతున్నాడు. మనిషి చూడటానికి పెద్ద అందంగా వుండడు.

అతనిలో ప్రత్యేక ఆకర్షణ అంటూ ఏమైనా వుంటే; అది అతని అందంలోనూ, దేహచ్ఛాయలోనూ లేదు కాని, మాటల్లోనూ, నడవడిలోనూ. పరిశుభ్రతలోనూ వుంది. స్వతహాగా మితభాషి అయిన నిరంజనం ఎప్పుడూ చాలా నీటుగా వుంటాడు. మాటలను తూచి వాడతాడు. అతని సంభాషణలో ఎన్నడూ ఎదుటిమనిషిని కించపరచటం కాని, పొగడటంకాని కన్పించదు. ఎదుటి వ్యక్తిమీద పెంచుకున్న భావాలను సులువుగా బయటపెట్టడు. సదా పెదవులపై వెలిగిపోయే చిరునవ్వే అతనిలోని ముఖ్య ఆకర్షణ.

శశి కాలేజీలో "పి. యు. సి"లో ప్రవేశించిన సంవత్సరమే అతనూ అదే క్లాసులో చేరాడు. అప్పటినుండీ తనకు తెలియకుండానే ఎందుకో అతనిని గమనించేది. తలదించుకొని కాలేజీకి రావటం, క్లాసులు పూర్తిఅయిపోగానే మళ్ళీ తన ఖ్యాసలో తాను వెళ్ళిపోవటం, మనిషి నిక్షిప్తంగా వుండటం, మొదలైన అంశాలు నిరంజనంమీద శశికి సదభిప్రాయం కలుగజేశాయి. మిగిలిన కాలేజీ కుర్రాళ్ళలాగ అమ్మాయిల వెంటబడి అల్లరిచెయ్యటం, కేరింతలు కొట్టటం లాటిపనులుకూడా నిరంజనం ఇంతవరకూ చెయ్యలేదనీ, మనిషి స్వతహాగా చాలా మంచివాడని అర్థంకావటానికి శశికి ఈ నాలుగుసంవత్సరాలూ పట్టలేదు—కొద్దినెలలు మాత్రమే అవుసరమయ్యాయి.

కాలేజీ వార్షికోత్సవాల సందర్భంలో అతను మొదటి సారిగా తనతో మాట్లాడాడు. అప్పుడుకూడా ఏవో రెండు కార్యాలు సున్నితంగా పలికి, కనీసం తన సమాధానంకోసరం ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు, తన అందంపట్ల అతడు చూపే నిర్లక్ష్యభావాన్నే శశి మొదటినుండీ కోరుకునేది!

ఇంకా చాలా ఇతరకారణాలవలన అయితేనేం, పరిస్థితుల ప్రోద్బలాన్నిబట్టి అయితేనేం, శశి నిరంజనాన్ని ప్రేమించలేదు, కాని—భర్త అయితే తన జీవితం హాయిగా గడచిపోతుందని మాత్రం ఆశించింది. ఆ ఆశతోనే అతని పైన ఉన్నతమైన భావాన్ని, గౌరవాన్ని నిలుపుకొంది. ఈ అభిప్రాయాలన్ని కలిపిచూస్తే "ప్రేమ"అనే పదార్థమే తయారయితే, శశి నిరంజనాన్ని ప్రేమించిందనికూడా చెప్పగో వచ్చునేమో!! తన అభిప్రాయాలను, ఆదర్శాలకు సరియైన వ్యక్తిగా నిరంజనాన్ని ఎన్నుకున్నట్లు మనసులో స్థిరనిశ్చయం చేసుకున్నాక ఒక పెద్దసందేహం మాత్రం మిగిలిపోయింది.

ఆ సందేహంతో ఆమెకు రాత్రి సరిగా నిద్రపట్టలేదు. "ఇంతకూ తనకు వివాహం చేసుకునేందుకు నిరంజనం ఇష్టపడతాడో, లేదో?" _ అదే సమస్య! దాన్ని త్వరగా తీర్చుకుంటే గాని మనశ్శాంతి లభించదు. అందుకే ఆ మరుసటి దినాన్నే దాన్ని కార్యరూపంలోకి మార్చింది శశి.

నిరంజాన్ని మరుసటిదినం సాయంత్రం కాఫీకి తమ ఇంటికి ఆహ్వానించింది. కాఫీ వ్యవహారం ముగిశాక తండ్రి ద్వారా ఈ విషయాన్ని వెల్లడిచేసింది. నిరంజనం కొంత సేపు యోచించి "తనతండ్రిని సంప్రదించి మరొకవారం రోజులలో నిశ్చయాన్ని తెలియజేస్తానని" మాట ఇచ్చాడు. తరువాత శశితో ఒంటరిగా కూర్చొని మాట్లాడుతూ అన్నాడు "మీలాంటి ఆకర్షణీయమైన తెలివితేటలు వున్న వారినీ, గుణాలు కలవారినీ పొందటం బహుశః నాఅదృష్టమే కావొచ్చు! కాని, ముందుగా నా మేలుకోరే నాతల్లి తండ్రులతో ఈ విషయం సంప్రదించి వారి అంగీకారం పొందటం ఎంతయినా అవుసరమనుకుంటున్నాను. నాకై నేనుకూడా కొన్ని ముఖ్యమైన విషయాలు ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి వుంటుంది. అందువలన, ఈ కాస్త ఆలస్యానికి మీరు మరోలా భావించరనుకుంటాను. వివాహం ఒక్కనాటితో తీరిపోయే సంబరంకాదుగా! మీ నాన్నగారిని రేపు మా ఇంటికి పంపితే, మా కుటుంబపరిస్థితులు కూడా చూస్తారు. మీరు ఏవో ఊహాలు నాపై కల్పించుకొని, అవి భవిషత్తులో దర్శించ లేకపోతే, వ్యథకు గురికావల్సివుంటుంది. మేము మిమ్ములను వంచించినట్లు కూడా అనుకోవటం జరుగుతుంది. అందువలన ముందుగానే అన్ని విషయాలు కూలంకషంగా చర్చించుకొని ఒక నిర్ణయానికి రావటం బాగుంటుంది."

తరువాత కొద్దిసేపు కాలేజీ విషయాలు చర్చించి వెళ్ళిపోయాడు నిరంజనం.

ఆ రాత్రి అంతా శశికి, అతనితో గడిపిన కొద్ది నిమిషాలూ కంటి ముందు మెదిలాయి. అతనిలోని వ్యక్తిత్వం ఆమెను బాగా ఆకర్షించింది. అతను మాట్లాడిన విషయాలలో తన అందానికి "గడ్డిపోచ" మాత్రం విలువ కూడా ఇవ్వలేదు. అదే తను కోరుకునేది!

ఇంతవరకూ తన వివాహ జీవితాన్ని గురించి భయంగా వుండేది శశికి. అదికాస్త ఆ సాయంత్రంతో తొలగిపోయి నట్లయింది శశికి! తన అందం పాడయిపోయినా తనను నిరంతరం అభిమానించే వ్యక్తి తనకు భర్తగా కావాలి. అంటే— తన అందాన్ని నిర్లక్ష్యం చేసే పురుషుడే తనకు కావాలని మరో సారి స్థిరనిశ్చయం చేసుకొంది.

♦ ♦ ♦ ♦

నిరంజనంనుండి కూడా పూర్తి అంగీకారం తెలుసుకున్న కొద్ది రోజులలోనే వారి వివాహం జరిగిపోయింది. వివాహం చాలా వైభవంగానే జరిగింది. దాంపత్య జీవితంలో ప్రవేశించిన మొదటి రాత్రి నిరంజనం ప్రక్కనే వెన్నెల్లో కూర్చొని దూరంగావున్న చెట్లవైపు చూస్తూ అడిగింది శశి.

"మీరు నాలో ఏం చూసి ప్రేమించగలిగారు?"

కొద్దిసేపటివరకూ సమాధానం రాకపోయేసరికి మళ్ళీ

"అదే ప్రశ్న అడిగి నిరంజనం ముఖంలోకి చూసింది శశి.

నిరంజనం నవ్వుతున్నాడు!

కొద్ది క్షణాలు గడిచాక "సమాధానం చెప్పితీరా లేమిటి?" కొంటెగా నవ్వుతూ అన్నాడు.

"చెప్పండి!" అంది గోముగా.

"సరే! నీ ప్రశ్నకు సమాధానం చెప్తానుగాని, ముందు నువ్వు నా ప్రశ్నకు జవాబు చెప్పు! ఇంతకీ నిన్ను ఎందుకు చూసి ప్రేమించానని అనుకుంటున్నావ్?" అంటూ ఎదురు ప్రశ్న వేశాడు.

"దీనికి సమాధానం చెప్పటం కొంచెం కష్టమయినట్లునే" అనిపించింది.

అందుకే జాగ్రత్తగా, ముద్దుగా మాట్లాడుతూ తప్పించుకొంది.

"ఊహూ! నేను చెప్పలేను బాబూ! నాకు సిగ్గా వుంది. మీరే చెప్పాలి!" అంది మూతిబిగించి.

"నీ సౌందర్యానికి ముగ్ధుడనయి, నిన్ను ప్రేమించాను. అది జీవితాంతం నా స్వంతం కావటంకోసం వివాహం చేసుకున్నాను" అన్నాడు తలనిమురుతూ.

★ ★ ★ శశి త్రుళ్ళి పడింది!!

నిరంజనం తత్వాన్ని గురించి తాను నిర్మించుకొన్న ఊహాసౌధాలన్నీ ఒక్కసారిగా నేల కూలినట్లయింది.

"అయితే నేను అందంగా వుంటానని ఒక్కసారి

అయినా నాతో చెప్పలేదేం?" కొంచెం హీనస్వరంతో పలికింది.

"గులాబీ పువ్వు అందంగానే వుంటుంది. కాని అది అందంగా వుంటుందని దానికి తెలిసినంతలో కలిసివచ్చే దేమిటి? దాన్ని ధరించేవాళ్ళు దాని అందంగుర్తించాలి!

అయినా, స్త్రీలతో వచ్చిన పెద్ద చిక్కు ఏమిటంటే వాళ్ళ అందాన్ని పొగిడితే; వెంటనే ఎదుటి పురుషుణ్ని నిర్లక్ష్యం చేయటానికి ఏ మాత్రం వెనుకాడరు! అందుకే నీతో ఎప్పుడూ అందంగా వుంటావని అనలేదు! పోనీ ఇప్పుడు చెప్తున్నా!

"నీ ముఖం చంద్రబింబంలా వుంది" అంటూ చిరునవ్వు చిందించాడు నిరంజనం.

శశి దీర్ఘంగా నిట్టూర్చి మాట్లాడకుండా వుండి పోయింది. ఇంత చేదు అయిన సత్యాన్ని అంతవరకూ ఎన్నడూ వినలేదు. క్షణంసేపు తియ్యని విషాన్ని మ్రింగుతున్నట్లు అనుభూతిని పొందింది.

* * *